క్లుప్తంగా

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో కర్నూలుకు పతకాలు



ఆల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించిన డైట్ లెక్చరర్ వెంకట సుబ్బమ్మ

కర్నూలు (టౌన్): ఈనెల 8 వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలుకు రెండు పతకాలు లభించాయి. 55 సంవత్సరాలు వయస్సు దాటిన విభాగంలో 4 ×400 రిలే రేసులో పాల్గొన్న కర్నూలు డైట్ కళాశాల లెక్చరర్ వెంకటసుబ్బమ్మ వెండి పతకం, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం సాధించారు. తమ కాలేజీ అధ్యాపకుడు జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ వసుంధర దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అరబిక్ విద్యార్థులకు పట్టాల ప్రదానం

వెలుగోడు: పట్టణంలోని జామియా సిరాజుల్ ఉలుమ్ అరబిక్ కళాశాలలో గత పది సంవత్సరాల నుంచి అరబిక్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల ప్రదాన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరు నగరానికి చెందిన హజరత్ మౌలానా ముఫ్తీ సాగీర్ అహమ్మద్‌ఖాన్, అతిథులుగా పీఎం మహమ్మద్ ముజమ్మిల్, మహమ్మద్ గౌస్ హాజరయ్యారు. కార్యక్రమంలో హాఫిజ్, అలీమ్, ఖారీ కోర్సులు పూర్తి చేసిన 118 మంది పట్టభద్రులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం సామూహిక దువా చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా అన్నపూర్ణాదేవి కల్యాణం

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాదేవి గృహస్థాశ్రమంలో ఆదివారం శ్రీ అన్నపూర్ణాదేవి సమేత సనారీ విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు, శివోహం టెంపుల్ ట్రస్ట్ నిర్వాహకులు అరవింద రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కొన్ని ఆశ్రమాల పీఠాధిపతులు, గురుబిడ్డలు, గురు భక్తులు, సాధువులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా లక్ష్మీ గణపతి హోమం, చండీ రుద్రం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి భజన కార్యక్రమం జరిగింది.

మహానందిలో సండే సందడి

మహానంది: సెలవు రోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం జరిగిన అభిషేకం, అష్టవిధ మహా మంగళ హారతుల సమయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహానందీశ్వర స్వామి దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

12న బహిరంగ వేలం పాట

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, పటముల అంగళ్లు నిర్వహించుటకు ఏడాది కాలానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. టెంకాయలు వేలానికి రూ.1లక్ష, పూలు, పటముల అంగళ్లకు రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

శాంతి మార్గం అనుసరణీయం

కౌతాళం:శాంతి మార్గంతోనే సమాజస్థాపన సాధ్యమని పాల్తూరు మఠం పీఠాధిపతి చెన్నవీర శివచార్య సాములు, హాల్వి మఠం పీఠాధిపతి మహాంతస్వామి, రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి మహాస్వాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలో భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మించిన త్రైంభాకేశ్వర స్వామి ఆలయాన్ని ఈనెల 22వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచి 11రోజుల పాటు 21వ తేదీ వరకు బసవేశ్వర స్వామి పురాణ ప్రవచన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో శాంతి, సోదరభావం ఏర్పడుతుందన్నారు. పురాతన ఆలయ స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్తులు కలిసి నిర్మించడం గొప్ప విషయమన్నారు. 22న ఆలయ ప్రారంభోత్సవం ఉంటుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక హోమాలు, విశేష పూజల అనంతరం గణపతి, పార్వతి దేవుళ్ల విగ్రహాల ప్రతిష్ఠోత్సవం జరిపిస్తామని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాలనీలో బుజ్జమ్మ అనే మహిళ 384 టెట్రా ప్యాకెట్లను కలిగి ఉందనే సమాచారం మేరకు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సీఐ గోపీచంద్ ఆదివారం తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించేందుకు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు.

మాది ప్రజా ప్రభుత్వం

- ఎన్నికల సమయంలో వచ్చే వారిని నమ్మవద్దు
- నగరంలో ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు చేశాం
- నగర మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): తమది ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని, 2019 నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే అందుకు నిదర్శనమని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఈ 58 నెలల కాలంలో రూ. వందల కోట్లు వెచ్చించి నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటిని ప్రతిపక్ష నాయకులకు చూపించేందుకు తాము సిద్ధమని చెప్పారు. ఆదివారం స్థానిక 18 వ వార్డు జొహరాపురంలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ. 40 లక్షలు వెచ్చించి చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి పక్కి మసీదు వరకు నిర్మించిన సీసీ కాల్వలను ప్రారంభించారు. అలాగే రూ. 45 లక్షలతో కేసీ కెనాల్ పొడవునా సీసీ రోడ్డు, ఫెన్సింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పార్టీ శ్రేణులలో కలిసి వైఎస్‌ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మా ఎజెండా నగర అభివృద్ధి అన్నారు. అభివృద్ధిలో ఐదేళ్ల క్రితం కర్నూలు నగరం ఎలా ఉంది..ఇప్పుడెలా ఉందో ప్రజలను అడిగితే వారే చెబుతారన్నారు. ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. నగరంలో పాతబస్తీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. శివారు కాలనీల్లో సైతం పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మెట్రోపాలిటిన్ సిటీల్లో కూడా లేని పార్కులు ఇక్కడ ఉన్నాయన్నారు. ఐదేళ్లకు ఒకసారి అది కూడా ఎన్నికల సమయంలో ఇళ్ల వద్దకు వచ్చే వారిని నమ్మవద్దన్నారు. ప్రజల కోసం పనిచేసే వైఎస్ జగన్ సర్కారును మరోసారి ఎన్నుకోవాలని కోరారు. అంతకు ముందు స్థానికులు తమ కాలనీకి ఒక బోరు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, స్థానిక కార్పొరేటర్ పల్లవి, పార్టీ నాయకులు గడ్డం రామక్రిష్ణ, లేపాక్షి, అక్బర్ చందు, చెన్నమ్మ, మాధవస్వామి, జమీల, ఫాతిమా, జమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు, హరే నామ సంకీర్తన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణ బద్ధులు కావాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు రామకృష్ణ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆ. ధ్వర్యంలో స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. అలాగే భారత భాగవతాలను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఈ గ్రంథాలు మానవ మనుగడకు మార్గదర్శకాలు అన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణకు ఉద్యమించండి



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): వాల్మీకులు ఎస్టీ పునరుద్ధరణ కోసం ఉద్యమించాలని వాల్మీకి అసోసియేషన్ ఫర్ ఎస్‌టీ రిజర్వేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్, విశ్రాంత ఉద్యోగి బాల వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం స్థానిక శంకరాస్ కళాశాల ఆవరణలో వాల్మీకి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమావేశం తిరుపతి సాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు 1956 నుంచి ఇప్పటి వరకు వాల్మీకులను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో న్యాయవాది సూర్యనారాయణ, నాయకులు వెంకటరమణ, రామాంజనేయులు, సుకుమార్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తిరుపతి సాయి, కో కన్వీనర్‌గా సుకుమార్‌తో పాటు తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు



యూటీఎఫ్ లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (సిటీ) : ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్‌ను స్థాపించి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. సంఘం పతాకాన్ని రాష్ట్ర సహధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధించే విడతల వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహులు, యూటీఎఫ్ సంఘం తొలి జిల్లా ప్రధాన కార్యదర్శి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, ఆ సంఘం సభ్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, రాష్ట్ర నాయకులు నాగమణి, యల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రమ శిక్షణతో క్రీడల్లో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లో సిలంబం మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన దేశ ప్రాచీన క్రీడ సిలంబం అన్నారు. ఈ క్రీడను కర్నూలులో అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. విద్యార్థులు యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి శారీరక ఆరోగ్య క్రీడలను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు వేసిన రైతులకు తీవ్ర నష్టాలు మిగిలాయిన్నారు. అయితే, ఇప్పుడు ఉల్లి పంటకు కూడా గిట్టుబాటు ధర లేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు.

సనాతన ధర్మాన్ని విస్తరిద్దాం

కర్నూలు కల్చరల్: విశ్వవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని విస్తరింపజేద్దామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ జాతి సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్, అధికార ప్రతినిధి రామాంజనేయులు, కర్నూలు మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు నాగేళ్ల అజయ్ బాబు, హరికిషన్, నంద్యాల సభ్యులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కర్నూలు కల్చరల్: మాఘ మాసం మాఘపూర్ణిమ, శివరాత్రి పండుగల ప్రత్యేకతలపై త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కర్నూలు, కల్లూరు కమిటీల ఆధ్వర్యంలో నగరంలోని పలు కాలనీల్లో ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ప్రభోద సమితి ఇందూజ్ఞాన వేదిక కర్నూలు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు నాగయ్య, కల్యాణ్, హరి జగదీష్, మధువాణి, ప్రమీల, సుశీల, వెంకటేష్, దివ్య, చందన తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పెద్దకబబూరు: మండలంలోని హనుమాపురం గ్రామంలో సారా స్థావరాలపై సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించినట్లు పెద్ద కడబూరు ఎస్‌ఐ మహేష్ కుమార్ తెలిపారు. ఉదయం హనుమాపురం కొండల్లో పోలీసు సిబ్బందితో కలిసి స్థావరాలపై దాడులు చేపట్టగా 800 లీటర్ల నాటుసారా లభ్యమైందని, అలాగే నాటుసారా తయారు చేసేందుకు ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కార్మిక రాజ్యస్థాపనే సీఐటీయూ అంతిమ లక్ష్యం



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): కార్మిక రాజ్య స్థాపనే తమ యూనియన్ అంతిమ లక్ష్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు స్పష్టం చేశారు. ఆదివారం రెండో రోజు కార్మిక, కర్షక భవన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మిక రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమం కోసం సీఐటీయూ పనిచేస్తోందన్నారు. దేశంలోని పాలక వర్గాలు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తుండడంతో భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో బి.రేణుక, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, షరీఫ్, విజయభారతి, జ్యోతి, పద్మజ, శాంతకుమారి పాల్గొన్నారు.

కొలనుభారతిలో పటిష్ట భద్రత



ఆలయ సిబ్బందితో చర్చిస్తున్న సీఐ

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషన్ తెలిపారు. ఆదివారం మండలంలోని శివపురం సమీపంలోని కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలను, ఎక్కడెక్కడ పోలీసు భద్రత అవసరం, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అశోక్, ఈఓ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 14న అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించనున్న వసంత పంచమి వేడుకల్లో భక్తులకు, సందర్శకులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం శివపురం గూడెంవద్ద వాహనాల పార్కింగ్ నిర్వహిస్తామని, అక్కడి నుంచి భక్తులను ప్రత్యేక బస్సుల్లో ఆలయం వద్దకు తరలిస్తామన్నారు. భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, పాలకమండలి చైర్మన్ వెంకట నాయుడు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పురుగుమందుల పిచికారీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతకుమారి

కర్నూలు(అగ్రికల్చర్): పురుగు మందులను పిచికారీ చేయడంపై అవగాహన పెంచుకోవాలని కలికిరి ఉద్యాన కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ శాంత కుమారి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అసిస్టెంటు ప్రొఫెసర్ పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పురుగు మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల విష ప్రభావానికి గురై అనేక మంది రైతులు మరణిస్తున్నారన్నారు. గాలికి ఎదురుగా నిలబడి పిచికారీ చేయరాదన్నారు. ఉదయం, సాయంత్రం వేలల్లోనే మందు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పురుగుమందులను ఎక్కడబడితే అక్కడ నిల్వ చేయరాదని, పిల్లలకు, మహిళలకు అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయ కర్త జయచంద్ర మాట్లాడుతూ... పంటల్లో వివిధ తెగుళ్ల లక్షణాలు, సూక్ష్మ పోషకాల లోపాల నివారణ తదితర వాటి గురించి వివరించారు. రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే

- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా.ఎ.సునీల్‌కన్నా



విద్యార్థినులతో మైనార్టీ సంక్షేమాధికారి డాక్టర్ సునీల్‌కన్నా

కర్నూలు(అర్బన్): పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉంటే విజయం మన సొంతమవుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా.ఎ. సునీల్ కన్నా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక గడియారం ఆసుపత్రి సమీపంలోని మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఎలా సంసిద్ధులు కావాలనే అంశంపై వివరించారు. అలాగే పదవ తరగతి అనంతరం ఇంటర్, డిగ్రీలో తీసుకోవాల్సిన గ్రూపులు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా కష్టపడి చదవాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా, వసతి దీవెన ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందని, అలాగే జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా ఇతర దేశాల్లో చదువుకునేందుకు కూడా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్ తదితర మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారిణి బీ పుష్పాంజలి, కార్యాలయ సీనియర్ సహాయకులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ శిక్షణతో స్వయం ఉపాధి

కర్నూలు (టౌన్): బ్యూటీ పార్లర్‌లో శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చునని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల అన్నారు. ఆదివారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని అనూస్ బ్యూటీ పార్లర్‌లో అనూస్ బ్యూటీ శిక్షణ కేంద్రం, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ మాట్లాడుతూ అందంగా కనిపించడం ఆత్మవిశ్వాసానికి ప్రతీక అన్నారు. నేటి అధునిక సమాజంలో బ్యూటీకి ఎంతో ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఇటువంటి రంగాలను నిరుద్యోగ మహిళలు ఉపాధిగా ఎంచుకోవాలన్నారు. దేశంలోనే పేరు గాంచిన అనూస్ సంస్థ ద్వారా ఉచితంగా 10 రోజుల పాటు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఎంఎం మురళీ, టీఎంసీ భారతి, సీఓలు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థాన ఉద్యోగుల ఔదార్యం



మృతుని భార్యకు చెక్కు అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల కాలంలో దేవస్థాన ఆలయ విభాగంలో భజంత్రీగా విధులు నిర్వహిస్తున్న ఎ.డి.వి.లక్ష్మయ్య గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు దేవస్థాన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం తరుపున మృతుని భార్యకు రూ.2,51,399 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం శ్రీశైలంలోని దేవస్థాన పరిపాలన భవనంలో మృతుని భార్యకు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాలాజీ నాయక్ ఉన్నారు.

గజ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రముఖులు, భక్తులు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకారంలో శ్రీవారు

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, మహా నారాయణ హోమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, హైకోర్టు మాజీ జస్టిస్ భవాని ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్, తెలంగాణ మాజీ ఎన్నికల అధికారి నాగిరెడ్డి, విశ్రాంత జిల్లా కలెక్టర్ రాంశంకర్ నాయక్, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ కల్కూర, రిటైర్డ్ పోస్టల్ సూపరింటెండెంట్ కేవీ సుబ్బారావు పూజల్లో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవారు గజ వాహనంపై పురవీధుల్లో మంగళ వాయిద్యాల కోలాటాల మధ్యలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కె రాజశేఖర్ రావు, రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర్‌రావు, సంఘం సభ్యులు మాధవ ప్రభు, కేజీ ప్రభాకర్‌రావు, దుర్గాప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

16న రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జె.దివాకర్

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో రవాణా రంగాన్ని కుదేలు చేస్తుందని ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ అన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా రవాణా సమ్మె చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆటో యూనియన్ జిల్లా నాయకులు బి.రాధాకృష్ణ అధ్యక్షతన సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ రంగ రవాణా కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైళ్లకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే భవిష్యత్‌లో రవాణా రంగం మూతపడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఆర్.నరసింహులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- రాంప్రియ నగర్‌లో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 19వ వార్డు రాంప్రియ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం రాంప్రియ నగర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థ పాలక వర్గం ఏర్పడ్డాక కాలనీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేలా కష్టపడి పని చేద్దామన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమాశంకర్‌రెడ్డి, 21వ వార్డు కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నెరవాడ గ్రామంలో సర్పంచ్ మదన్‌గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.30.80లక్షలతో నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు, ఇంటింటికీ కుళాయి, ఎస్సీ కాలనీలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డులను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు ఎంపీపీ బోయ శారద, కర్నూలు నగర పాల సంస్థ డిప్యూటీ మేయర్ రేణుక ముఖ్య అతిథులుగా హాజరై అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి.. ప్రజల చెంతకే అన్ని సేవలు తీసుకువచ్చారని చెప్పారు. కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందేవని గుర్తుచేశారు.

వక్కెర వాగుపై బ్రిడ్జి త్వరలో పూర్తి

వక్కెర వాగుపై సుమారు రూ.35లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు జయరాఘవేంద్రారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, టి.నరసింహులు, టి.శీను, గౌస్‌పీరా, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, ఎంపీడీఓ రమణమూర్తి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.